# ఒకే ఒక్క రూపాయి

సదాశివం నవ్వాడు.

పకపకా నవ్వాడు.

విరగబడి మరీ నవ్వాడు.

పొట్ట చెక్కలయ్యేలాగ ఆయాసం వచ్చేదాకా రొప్పుతూ నవ్వాడు .....

అలా నవ్వి నవ్వి, అలిసిపోయి కంఠం నెప్పిపెట్టి, కళ్ళనీళ్ళు వచ్చి, వెంటనే వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

ఏడుస్తూనే మళ్ళీ నవ్వాడు.

ఆ నవ్వులో మళ్ళీ అంతా ఏడుపే!

ఇలా ఏడుస్తూ నవ్వుతూ పార్కులో బెంచీమీద వెల్లకిలా పడుకున్న సదాశివం మీద, ఎర్రని వెలుగు ప్రాకి ప్రాకి, చివరికి కళ్ళమీద జిగేల్ మంది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు సదాశివం!

పశ్చిమాన అస్తమిస్తూన్న సూర్యుడు, పోతూపోతూ తన మీద విసిరిన వెలుగు కిరణం అది!

తటిల్లుమని మెరిసింది.

హఠాత్తుగా మిరుమిట్లు గొలిపే కాంతి పడ్డంవల్ల ఒక్క క్షణం కళ్ళు చీకట్లు క్రమ్మాయి.

కళ్ళు నులుపుకొని చూశాడు సదాశివం.

పడమటి దిక్కున అస్తమిస్తూన్న సూర్యుడు!

ఎర్రగా మిలమిల మెరిసిపోతూ, కొలిమిలోంచి అప్పుడే తీసిన పెద్ద రూపాయి బిళ్ళలా –

దేవతా మూర్తుల వెనక గిరగిరా తిరుగుతూ ఉండే కాంతి చక్రంలా –

ఇరుసు కదలకుండా, గిర్రున తిరుగుతూన్న ఎర్ర చక్రంలా, సూర్యుడు! అస్తమిస్తూన్న సూర్యుడు! తను తిరుగుతూ, లోకాన్ని తిప్పుతూ తెల్లగా నవ్వే రూపాయి బిళ్ళలా, ఎర్రగా మెరిసిపోతూన్న సూర్యుడు!

సదాశివానికి గతం జ్ఞాపకం వచ్చింది!

గతం అంతా ఒక్కమారు మనస్సులో గిర్రున తిరిగింది.

విషాదంగా నవ్వుకున్నాడు.

రూపాయి!

ఒకే ఒక్క రూపాయి!

ఎంత తమాషాగా ఆడుకొంది తన జీవితంతో!

పుట్టినప్పటి నుంచి ఇంటర్ మీడియేట్‌లో జేరేదాకా, ఒక్కటి, ఒక్కటంటే ఒక్క రూపాయి తన జేబులో ఎప్పుడూ లేదు.

ఎప్పుడేనా కాణీయో, అర్ధణాయో, మహా అయితే ఒక అణాయో ఇచ్చేవాడు కాని 'ఇదిగో ఇది పెట్టి ఏదైనా కొనుక్కో' అని, ఓ రూపాయి ఎప్పుడూ తనకి ఇచ్చిన పాపాన్ని పోలేదు నాన్న.

అయినా ఎలా ఇవ్వగలడు.

అప్పట్లో ఆయనకి వచ్చేదే నెలకి ముప్పయి అయిదు రూపాయల జీతం!

అందులోనే ఇంటద్దె, బియ్యం, ఇంటి ఖర్చు, అమ్మ మందులూ, తనూ చెల్లాయితో బాటు మొత్తం ఇంట్లో నలుగురికి బట్టలూ, తన చదువూ, ఇన్ని వెళ్ళాలి!

అటువంటి పరిస్థితిలో తన సాదరుకి నాన్న ఓ రూపాయి ఇవ్వగలడా?

అయినా, తనని ఇంటర్మీడియేట్‌లో కాలేజీలో చేర్పించేటప్పుడు, జీతాలూ, ఫీజులూ అన్నీ కట్టేశాక, మిగిలిన ఒక్క రూపాయీ నాన్న తన జేబులో వేస్తూ "కాలేజీ చదువుకి వచ్చావు. ఎప్పుడేనా అవసరం రావచ్చు – జేబులో ఈ రూపాయి ఉంచుకో!" అన్నాడు.

అదిగో! అలా మొదటిసారిగా ఓ రూపాయి తన జేబులోకి వచ్చింది.

అంతే! ఆ రూపాయిని తను ఖర్చుపెట్టలేదు!

మధ్య మధ్య జేబులోంచి తీసి చూసుకుంటూ, మళ్ళీ భద్రంగా జేబులో పెట్టుకుంటూ, రెండేళ్ళ ఇంటర్మీడియేట్ చదువూ నెట్టుకుంటూ వచ్చాడు.

భోజనం ఇంట్లోనే!

కాలేజీకీ ఇంటికీ నడిచి వెళ్ళి వస్తూండడం. ఇంక ఖర్చు ఏం ఉంది తనకి? అందుకే ఆ రూపాయి జాగ్రత్తగా జేబులోనే ఉంది రెండేళ్ళూ.

రెండో సంవత్సరం చివర, తన క్లాసువాళ్ళందరూ, ఫేర్‌వెల్ పార్టీకి ఒక రూపాయీ, ఫోటో కాపీకి ఒక రూపాయీ వసూలు చేస్తున్నప్పుడు తన వంతుగా ఇన్నాళ్ళూ జేబులో దాచుకొన్న ఆ రూపాయి ఇచ్చాడు ఫేర్‌వెల్ పార్టీకని.

ఫోటో కాపీ అఖ్ఖర్లేదన్నాడు!

అవును - మరో రూపాయి తన దగ్గర్లేదు. నాన్న ఇవ్వడు-ఇవ్వలేదు కూడా!

అలా ఒకే ఒక్క రూపాయి ఆనాడు తన దగ్గర లేకపోవడంవల్ల గ్రూప్ ఫోటో కాపీ తను తీసుకోలేకపోయాడు - తీసుకుని ఉంటే, ఎప్పుడేనా ఆ ఫోటో చూడ్డానికి, అప్పటి కాలేజీకి సంబంధించిన మధురస్మృతుల్ని జ్ఞాపకం తెచ్చుకోడానికి అవకాశం ఉండేది.

ఆ తియ్యని అనుభవం, ఒక్క రూపాయి లేకపోవడం వల్ల, తనకి జీవితాంతం దక్కకుండా పోయింది!

అది ఒక్కటేనా?

రూపాయి తనతో ఇంకా ఎన్నిసార్లు ఆటలు ఆడుకోలేదూ!

ఇంటర్మీడియేట్‌లో ఫస్ట్‌క్లాసు వస్తే ఆ రోజుల్లో ఇంజనీరింగ్‌లో సీటు వచ్చేది! "మీ అబ్బాయికి ఇంజనీరింగ్‌లో సీటు వస్తే, ఆ చదువంతా నేను చెప్పించి, ఖర్చంతా పెట్టుకొని, ఉద్యోగం కూడా వేయించుకొని, మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేసి, నా అల్లుణ్ణి చేసుకుంటాను" అని డివిజినల్ ఇంజనీర్‌గారు నాన్నతో తరుచు అనేవారుట!

'ట' ఏవిటి? తన చెవుల్తో తను విన్నాడు, ఆయన అలా ఒకటి రెండు సార్లు అనడం.

ఆ ఊహతోటే మనస్సు గంతులు వేసేది!

తను ఒక ఇంజనీర్!

డివిజినల్ ఇంజనీర్‌గారు తన మామ!

ఆయన కూతురు మెరుపు తీగలాంటి పార్వతి, తన భార్య!

తను సదాశివం!

ఆమె పార్వతి!

ఓహ్! అద్భుతంగా కుదిరాయి పేర్లు!

రంగుల కలలు కంటూ ఆ రోజు తను ఆలశ్యంగా లేచాడు నిద్రనుంచి-

ఉదయం ఎనిమిది గంటలకి లెఖ్ఖల పేపరు!

తను లేచేటప్పటికే ఏడున్నర అయింది.

లెఖ్ఖల పేపరంటే తనకి లెఖ్ఖలేదు.

అందుకే రాత్రి, పెద్దగా ఏం చదవకుండానే పడుకున్నాడు. పరీక్ష టైమయిందని గబగబా స్నానం చేసి బట్టలు వేసుకునే సరికి పక్కింట్లో గోడగడియారం ఠంగ్ ఠంగ్ మంటూ ఎనిమిది కొట్టేసింది. గంటలతో బాటు తన గుండెకూడా వేగంగా కొట్టుకుంది.

ఒక్కటే! ఒక్కటంటే ఒక్క రూపాయి ఉంటే, ఝూమ్మంటూ ఏ రిక్షాయో ఎక్కి పది నిముషాల్లో పరీక్ష హాలుకి జేరుకొనేవాడు.

కాని ఏదీ?

అదే ఉంటే, రాత్రి తెల్లవార్లూ ఫెళ్ళుమంటూ నూట రెండూ నూట మూడు డిగ్రీల జ్వరంతో అల్లాడిపోయిన చెల్లికి, ఏ 'నెవిల్' మాత్రో తెచ్చి వేసి, తాత్కాలికంగా నైనా ఉపశమనం కల్గించక పోయేవాడా నాన్న!

నాన్న పరిస్థితి తెలిసిఉండీకూడా, రిక్షాకి రూపాయి ఇమ్మని ఎలా అడుగుతాడు?

అందుకే రొప్పుకుంటూ రోజుకుంటూ పరీక్ష హాలుకి పరిగెట్టాడు తను.

ఇంకా నయం - అదృష్టం - అరగంట బెల్ కొట్టలేదు. కొడితే తనని హాల్లోకి రానియ్యకపోదురు.

వగుర్చుకుంటూ, ఇన్విజిలేటర్ దగ్గర క్వొశ్చన్ పేపరూ ఆన్సర్ బుక్కూ తీసుకున్నాడు.

లెఖ్ఖలన్నీ తను చెయ్యగలిగినవే!

కాని అన్ని లెఖ్ఖలూ చెయ్యడానికి తనకి టైము సరిపోలేదు. ఇంకో రెండు లెఖ్ఖలు చెయ్యాల్సి ఉండగా ఇన్విజిలేటర్ పేపరు తీసేసుకున్నాడు. అదీకాక కంగారులో ఒక లెఖ్ఖ తప్పింది. మొత్తం మూడింటి మింజుమలె, నూటికి నూరు రావలసిన పేపర్లో తనకి డెబ్బయి దాటి రాలేదు.

దాంతో మొత్తంమీద ఫస్ట్ క్లాసుకి పది మార్కులు తగ్గాయి.

ఇంజనీరింగ్ సీటూ, ఆ సీటుతో తను కన్నకలలూ అన్నీ కరిగిపోయాయి.

తన భవిష్యత్తే భగ్నం అయిపోయింది.

అంతా ఆ ఒక్క రూపాయీ లేకపోవడం వల్ల.

అదే ఉండి, ఆ రోజున తను పరీక్షకి ఝామ్మని రిక్షాలో వెళ్ళగలిగి ఉంటే....?

ఓహ్!

ఈపాటికి తనో ఇంజనీరు ......

విద్యుల్లతలాంటి పార్వతి తన భార్య!

తమకో బంగళా, కారు!

ఇప్పుడేమైంది? ఇంటర్‌తో చదువు పూర్తిచేసి బేంక్ టెస్ట్‌లకి కూర్చుని, బేంక్‌లో క్లర్కుగా తృప్తి పడాల్సివచ్చింది. గీత లాంటి మామూలు అమ్మాయిని పెళ్ళి చేసుకొని, తన నుదుటి వ్రాత ఇంతే అని సరిపుచ్చుకోవలసి వచ్చింది.

కానయితే, తనకి గీత వల్ల వచ్చిన పదివేల కట్నంలో చెల్లెలకి ఓ సంబంధం చూసి పెళ్ళి చెయ్యగలిగాడు నాన్న.

అదొక్కటే తృప్తి!

ఆ తర్వాత, అమ్మ టి.బి. వచ్చి పోవడం, గీతతో తను పట్నంలో కాపురం పెట్టడం, రిటైరయిన నాన్న, ఉన్న ఊరు వదిలి రావడం, ఇవి అన్నీ తన జీవితంలో చకచకా జరిగిపోయిన కొన్ని ముఖ్యమైన సంఘటనలు!

ఆ అయిదారేళ్ళూ గొప్పగా హాయిగా బ్రతకక్కపోయినా, డబ్బు లేదని తను పెద్దగా ఇబ్బందిపడలేదు.

ఏదో రోజులు అలా దొర్లించుకుంటూ వస్తూన్న తనతో మళ్ళీ డబ్బు ఆటలాడుకోవడం మొదలెట్టింది. వర్తినే ఆటలాడుకోవడం కాదు.

తనమీద చావు దెబ్బ తీసింది!

ఆ రోజు తనకి బాగా జ్ఞాపకం!

అది, గీత పుట్టిన రోజు!

అప్పటికి నాలుగైదేళ్ళనుంచి, ప్రతి పుట్టినరోజునాడు ఓ పట్టుచీర కొని పెడతానని గీతకి మాట ఇస్తూనే వచ్చాడు. కాని ఏ ఏడాదీ కొనలేకపోయాడు. ఈ ఏడాది తప్పకుండా కొందాం అనుకున్నాడు.

కాని సరిగ్గా వారం రోజులకి ముందే, నాన్నకి కంటి ఆపరేషన్, కళ్ళజోడు మార్చడం, తను ఒకటి రెండుసార్లు పల్లెటూరు, ఆ పనులమీద వెళ్ళి రావడం దానాదీనా, రెండు వందల రూపాయల దాకా ఖర్చు అయిపోయింది. పట్టుచీర కోసం అని స్నేహితుల దగ్గర చేసిన అప్పులో, వంద రూపాయలకి తక్కువగా మిగిలింది.

దాంతో పట్టుచీర రాదు.

మరోచోట ఎక్కడా అప్పు పుట్టే అవకాశం లేదు.

ఈ ఏటికి నూలు చీరతో సరిపెట్టుకోమన్నాడు గీతని.

"ఛట్! వీల్లేదం"ది.

బతిమాలాడు - బామాలాడు.

పరిస్థితి వివరించాడు - అర్థం చేసుకోమన్నాడు.

"ససేమిరా" అంది గీత.

విసుక్కున్నాడు - కేకలేశాడు.

తను అరిస్తే గీత కూడా అరిచింది.

మాటకి మాట పెరిగింది!

తగాదా తారాస్థాయికి చేరింది.

పంతాలు ప్రారంభమయ్యాయి.

పట్టింపులు పెరిగాయి.

"పట్టుచీర అయినా కొనలేని పరమ దరిద్రుడని తెలిస్తే, ఈ దరిద్రపు పెళ్ళి చేసుకోకుండా ఉండేదాన్ని" అంది కోపంతో రెచ్చిపోయిన గీత –

తను కూడా అంతకంటే రెచ్చిపోయి "ఇప్పుడు తెలిసిందిగా? మరేం చేస్తావు? కాపురం వదిలేసి పుట్టింటికి వెళతావా?" అన్నాడు వ్యంగ్యంగా.

"వెళతా ... వెళతాను - నా యిష్టం"

"అయితే కానియ్యి"

"వెళితే మరి ఇంక వచ్చేప్రసక్తి లేదు"

"అఖ్ఖర్లేదు"

ఈ రకంగా సాగాయి మాటలు.

గీత అన్నంత పని చేసింది.

తనకి వంటరితనం మిగిల్చింది.

కాపురం వదలి గీత పుట్టింటికి వెళ్ళిపోయిందన్న సంగతి పల్లెటూళ్లో ఉన్న తండ్రికీ, హైదరాబాదులో ఉన్న చెల్లికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు.

ఒక్కడే ఉండడం వల్ల, ఇన్నాళ్ళనుంచీ చేసిన అప్పులు ఒక్కొక్కటే తీర్చ గలుగుతున్నాడు.

ఇంకో రెండు మూడు నెలలైతే అప్పులన్నీ పూర్తిగా తీర్చేసి వుండేవాడు!

ఏదో, రోజులు అలా జాగ్రత్తగా ధొర్లిస్తున్నాడు.

ఓ రోజున పిడుగులాంటి ఉత్తరం వచ్చింది.

"మీ నాన్న పరిస్థితి ఏం బాగోలేదు, వెంటనే రమ్మని".

పల్లెటూళ్ళో పక్కింటి మావయ్యగారు రాసిన కార్డు అది.

వెంటనే బేంక్‌కి శలవు పెట్టి ఆ రాత్రి రైలులో వెళదాం అనుకున్నాడు.

పరిస్థితి ఎలా ఉందో!

చేత్తో రెండు మూడు వందలైనా పట్టుకుని వెళ్ళకపోతే ఎలా?

వందల మాట ఎలా ఉన్నా రైలు ఛార్జీలకైనా ఉండాలా?

తను పేసింజర్‌లో వెళ్ళినా తొమ్మిది రూపాయల టిక్కెట్టు.

చూస్తే తన దగ్గర ఎనిమిదే ఉన్నాయి.

ఒక్క రూపాయి తక్కువ!

మళ్ళీ ఆ ఒక్క రూపాయీ ఎవర్నో ఒకర్ని బదులడిగి వెళ్ళడం ఎందుకు?

తెల్లారితే జీతాలు అందే రోజు!

ఏకంగా జీతం తీసుకొనే వెళ్ళొచ్చని ఆగాడు.

అంతే - జీతం ఇలా తీసుకుని జేబులో పెట్టుకున్నాడు, అలా టెలిగ్రాం వచ్చింది, 'నాన్న చనిపోయాడని'

కళ్ళు చీకట్లు కమ్మాయి

లోకం శూన్యం అయినట్లయింది.

తల బాదుకుని ఏడ్చాడు.

నిన్నే వెళ్ళిఉంటే కడసారి చూపులైనా దక్కేవి.

వెళ్ళలేకపోయాడు. ఒక రూపాయి తక్కువయి వెళ్ళలేకపోయాడు - ఒకే ఒక్కరూపాయి! జన్మ యిచ్చిన తండ్రి ఆఖరిసారిగా చూసుకోలేకుండా చేసింది.

తండ్రి లేడు. తల్లి ఎప్పుడో పోయింది. కట్టుకొన్న ఇల్లాలు అలిగి తనని వదిలేసి వెళ్ళిపోయింది. ఇంక తనకి ఎవరున్నారు? ఉన్న ఒక్క చెల్లెలూ భర్తతో కాపురం చేసుకుంటోంది. తన దగ్గరికి వచ్చి ఎందుకుంటుంది?

తను వంటరివాడయిపోయాడు, ఈ లోకంలో -

ఎవ్వరూ లేరు తనకి - ఏకాకి జీవితం!

బ్రతుకు నీరసంగా నిర్జీవంగా గడుస్తోంది!

తింటున్నాడు - పడుకుంటున్నాడు. బేంక్‌కి వెళ్ళి ఉద్యోగం చేస్తున్నాడు.

ఏదో - యాంత్రికంగా గడుస్తున్నాయి రోజులు.

సరదా, సంతోషం ఏం లేకుండా భారంగా గడుస్తున్నాయి.

విధి - అదృష్టం - జీవితం - మరణం - వీటి గురించే నిత్యమూ ఆలోచన అయిపోయింది.

ఎప్పుడూ ఆలోచనే!

ఎప్పుడూ పరధ్యానమే!

పరధ్యానంగా పనిజేస్తూండడంవల్ల రోజూ కేష్‌లో తేడాలు రాసాగాయి.

ఓ రోజు పది రూపాయలు తగ్గాయి

మరో రోజు అయిదు రూపాయలు ఎక్కువ వచ్చింది లెఖ్ఖల్లో –

ఓ మాటు ఏమైందో రెండు రూపాయల సెక్షనే కనిపించలేదు సొరుగులో–

మరోమారు కష్టమర్‌కి పదిరూపాయల కట్ట ఇవ్వబోయి వంద రూపాయల కట్ట ఇచ్చేశాడు – అతను మంచివాడు కనుక ఆ కట్ట వాపసు చేశాడు.

లేకపోతే?

కళ్ళు గిర్రున తిరిగాయి! మెదడు మొద్దుబారిపోయింది. జరగబోయేది తలుచుకుంటే –

చివరికి ఓ రోజున అదీ జరిగింది –

రెండు గంటలకి ట్రాన్సాక్షన్ అంతా క్లోజ్ చేసి, కష్టమర్స్‌ని అందర్నీ పంపించేసి. లెఖ్ఖలు చూసి, కేష్ సరిపోయిందో లేదో సరిచూసుకుంటూంటే, హఠాత్తుగా ఇన్‌స్పెక్షన్ స్క్వాడ్ వచ్చింది.

పుస్తకాలూ, లెడ్జెర్లూ, కాగితాలూ, కేష్ అంతా, అలా ఆ మట్టున వదిలేసి, తను కౌంటర్ బయటికి వచ్చి నుంచున్నాడు –

స్క్వాడ్ వారు తనిఖీ చేసి, లెఖ్ఖలు చూసి, వంద రూపాయలు మిస్సింగ్ అని తేల్చారు!

తను భయపడ్డంతా అయింది!

రిజర్వు బేంక్ నుంచి వచ్చిన కొత్త నోట్లు కావాలంటూ ప్రొద్దుటి నుంచీ ఒకటే జనం – ఒకటే హడావిడి –

ఆ హడావిడిలో ఎవరికో ఒక రూపాయి సెక్షన్ ఎక్కువ ఇచ్చేసి ఉంటాడు.

మళ్ళీ రూపాయి తన జీవితంలో ఆటలాడుకొంది.

ఇన్నాళ్ళూ తనని చూసి నవ్వుతూ వచ్చింది.

ఇవాళ నవ్వలేదు.

వికటాట్టహాసం చేసింది.

ఉద్యోగం లోంచి టెంపరరీగా సస్పెండ్ చేశారు.

తర్వాత తంతు ఏవిటో తనకి తెలుసు.

బేంక్ ఉద్యోగంలో ఏ తప్పు వచ్చినా ఫర్వాలేదు కాని కేష్ విషయంలో తేడా రాకూడదు...

అది చాలా సీరియస్ తప్పిదం క్రింద పరిగణిస్తారు.

ఎంక్వయిరీ కేసు – శిక్ష!

కళ్ళముందు జైలు కటకటాలు కనిపించాయి.

పిచ్చిగా ఓ కేకపెట్టి, గట్టిగా కళ్ళూ చెవులూ మూసుకున్నాడు.

ఉద్యోగానికి రాజీనామా చేసి, ఆ నరకం నుంచి బైటపడ్డాడు.

తర్వాత చెప్పడానికేం ఉంది?

ఆకలేస్తే, జేబులో డబ్బులుంటే హోటల్లో రెండు ఇడ్లీలో, జంగిడి వాడి దగ్గర కాసిన్ని వేరు శనక్కాయలో కొనుక్కు తినడం –

నిద్ర వస్తే పార్కులోనో, రైల్వే స్టేషన్‌లోనో కాళీగా ఉన్న బెంచీ చూసుకు పడుకోవడం –

అందరూ తనకి పిచ్చెక్కిందనుకున్నారు.

కొందరు అవహేళన చేశారు.

కొందరు జాలిపడ్డారు.

అలా జాలిపడ్డవాళ్ళు ఎప్పుడేనా అయిదూ, పదీ ఇస్తూ, ఆకలితో తను చచ్చిపోకుండా ఆదుకుంటున్నారు. రోజులు గడుస్తున్నాయి. బేంక్‌లో ఒకప్పటి తన కొలీగ్ రెండు రోజుల క్రితం కలిసి "సదాశివం – ఏవిటిదంతా? నీకు ఉద్యోగం తప్పకుండా తిరిగి వస్తుంది. నీ రాజీనామా లేఖ పైకి పంపించకుండా ఆపాం – యూనియన్ నీ కోసం అధికారులతో పోరాడుతోంది" అని చెప్పి, "ఇదిగో ఇది తీసుకో" అని పది రూపాయలు తన చేతిలో పెట్టి వెళ్ళాడు –

ఉద్యోగం వస్తుందని తనకి నమ్మకం లేదు. విధి తనని వెక్కిరించింది – తన బ్రతుకు మళ్ళీ బాగుపడ్డమా? విషాదంగా నవ్వుకున్నాడు.

ఆశలేదు – తనకి ఉద్యోగం రాదు – వస్తుందని వెర్రి ఆశ పెట్టుకుని

బ్రతకడం అనవసరం. విరక్తితో మనస్సు పూర్తిగా విరిగిపోయింది. అందుకే హొటల్లోకి వెళ్ళి స్వీట్‌తో సహా శుభ్రంగా భోంచేసి, తొమ్మిది రూపాయలు బిల్లయితే, చెల్లించి, మిగిలిన ఒక్క రూపాయితోటీ ఈ పార్క్ బెంచీ మీదకి వచ్చి చదిగిలబడ్డాడు మొన్న సాయంత్రం.

చేతిలో మిగిలిన ఆ ఒక్క రూపాయినీ, గాలిలోకి మీటి పట్టుకుంటూ "ఇన్నాళ్ళూ నా జీవితంతో నువ్వు ఆడుకున్నావు. ఇప్పుడు చూడు - నీతో నేను ఆడుకుంటున్నాను" అంటూ, దాన్ని ఇంకా పైపైకి గాలిలో ఎగరవేయసాగాడు.

ఆ సమయంలో వచ్చాడు లాటరీ టిక్కెట్లు అమ్మేవాడు - "అయ్యా! ఒక్కటే టిక్కెట్టు ఉంది. ఇవాళే డ్రా - ఫస్ట్ ప్రైజు ఇరవై లక్షలు - కొంటారా సార్?" అంటూ దీనంగా అడిగాడు.

"ఇరవై లక్షలు!"

తను పకపకా నవ్వాడు.

"ఒక్క రూపాయి పెట్టి టిక్కెట్టు కొనండి సార్ ... ఒక్క రూపాయి! ఒకే ఒక్క రూపాయి"

తను మళ్ళీ నవ్వాడు.

"ఊ .... తీసుకో - ఈ రూపాయి నన్నెప్పుడూ రక్షించలేదు. వీలైనప్పుడల్లా కాటువేస్తూనే వచ్చింది. నాకు ఉపయోగపడని ఈ రూపాయి నీకు ఉపయోగపడు తుందంటే తీసికెళ్ళు" అన్నాడు.

వాడు రూపాయి తీసుకుని కళ్ళకద్దుకుని జేబులో వేసుకున్నాడు. వద్దంటున్నా వినకుండా ఆ లాటరీ టిక్కెట్టు తన జేబులోకుక్కి వెళ్ళిపోయాడు - అది మొన్న జరిగింది.

ఇప్పుడు ఆ టిక్కెట్టుకి ఇరవై లక్షలు!

ఒకే ఒక్క రూపాయికి ఇరవై లక్షలు!

ఎంతగానో తనకి అవసరం ఉన్నప్పుడు, ఈ రూపాయి తనకి అందకుండా పోయింది.

అవసరంలేనప్పుడు - ఇప్పుడు - ఇరవై లక్షల నవ్వులతో తన దగ్గరికి నడుచుకుంటూ వస్తోంది.

ఒక్క రూపాయి!

ఒక్కే ఒక్క రూపాయి!

తనతో ఆడుకుంటోంది! అప్పుడోలాగ ఇప్పుడింకోలాగ - సదాశివానికి నవ్వు వచ్చింది.

నవ్వాడు - పకపకా నవ్వాడు - విరగబడి మరీ నవ్వాడు.

పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వాడు.

నవ్వి, నవ్వి, చివరికి వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుండిపోయాడు సదాశివం-

గర్భ దరిద్రుడైన సదాశివం-

లక్షాధికారి అయిన సదాశివం-

(స్వాతి -1996)

*